## వరద బాధితులకు ఇదిగో సిద్దిపేట సాయం



ఖమ్మం వరద బాధితులకు అందజేయడానికి సిద్దిపేట నుంచి నిత్యావసర సరుకుల వాహనాలను పంపుతున్న మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు



సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు పంపిన సరుకుల లారీలతో ఖమ్మంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, పగడాల తదితరులు

## ఊరుకో చెల్లి



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండాలో వరద ప్రభావిత బాధిత మహిళలను ఓదారుస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

- ఇంతటి ఘోరమా?



మహబూబాబాద్ జిల్లా అయోధ్యలో కొట్టుకుపోయిన చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

- అన్నీ తడిసి ముద్దయినయ్



ఖమ్మం నగరం బొక్కలగడ్డలో తడిసిన సామాన్లను బ్యాగులో సర్దుతున్న బాధితుడు

- ఇల్లంతా ఇదే రీతి



ఖమ్మం నగరంలోని మోతీనగర్‌లో ఇంటిలో తడిసిన సామాన్లు, దుస్తులను శుభ్రం చేసుకుంటున్న మహిళ



మహబూబాబాద్ జిల్లా దుబ్బతండాలో ఆకేరువాగు వరద ప్రభావంతో పొలాల్లో వేసిన ఇసుక మేటలు

- బువ్వకెట్ల?



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాలో ఇంట్లో దాచుకున్న వడ్లు మొలకెత్తాయని చూపుతున్న మహిళ



ఖమ్మంలో బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావును విడుదల చేయాలని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

# తండాలో మిగిలింది 'దుబ్బే'

- ఆకేరు వాగు వరద తాకిడితో కొట్టుకుపోయిన పంటచేలు
- పొలాల్లో వేసిన ఇసుక మేట.. లక్షలాది రూపాయల నష్టం
- భరోసా ఇవ్వని అధికారులు
- దుబ్బ తండావాసుల ఆవేదన

మహబూబాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : తిందామంటే తిండి లేదు.. కట్టుకుందామంటే బట్టలేదు.. ఇంట్లో ఉందామంటే మొత్తం బురదే.. ఇది దుబ్బతండా వాసుల దుస్థితి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆకేరు వాగు వరద ముంచెత్తడంతో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండా తీవ్రంగా నష్టపోయింది. పంటలతోపాటు గొడ్డుగోదా కొట్టుకుపోగా, ఇంట్లో ఉన్న బియ్యం, ఉప్పు, పప్పు, ఇతర నిత్యావసరాలు, దుస్తులు తడిసి ముద్దయ్యాయి. సర్వస్వం కోల్పోయిన ఆ తండావాసులకు చివరికి మిగిలింది దుబ్బే. దుబ్బతండాలో 50 ఇండ్లు ఉండగా, సుమారు 200 మంది నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సృష్టించిన వరద బీభత్సంతో తండా రూపురేఖలు లేకుండా పోయింది. తెల్లవారుజామున 4 గంటలకు ఇళ్లల్లోకి వరద వస్తుండటంతో గమనించిన ప్రజలు ఉత్త చేతులతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పక్కనే ఉన్న చిలుక్కోయపాడు గ్రామానికి వెళ్లి తలదాచుకున్నారు. మూడు రోజుల తర్వాత తండాకు వచ్చిన ప్రజలు ఇప్పుడిప్పుడే తమ ఇళ్లను శుభ్రపరచుకుంటున్నారు. ఓ రైతుకు చెందిన 30 బస్తాల జొన్నలు వరదలో కొట్టుకుపోగా, కొందరు రైతుల వరి, మిర్చి, పత్తి నీట మునిగింది. మరి కొంతమంది పంటలతోపాటు మోటర్లు, మీటర్లు వరదలో కొట్టుకుపోయాయి. రెండు ఇండ్లు పూర్తిగా కూలిపోగా, మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. తండా అంతా బురదతో నిండిపోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడ ఉండలేని పరిస్థితి నెలకొన్నది.

### సీఎం చెప్పినా దక్కని భరోసా..

సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు వచ్చి వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారే తప్ప ఇప్పటివరకు దుబ్బతండా వాసులను పలుకరించినవారే లేకుండా పోయారు. తాము పంటల కోసం పెట్టిన పెట్టుబడిని ప్రభుత్వం నష్ట పరిహారంగా రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే తండాకు చెందిన ధరావత్ రాజమ్మ మనుమరాలికి పెండ్లి కుదరగా అకస్మాత్తుగా వచ్చిన వరద ఆమె ఇల్లును గుల్ల చేసింది. పెండ్లి కోసం రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేసిన 5 క్వింటాళ్ల బియ్యం, ఇతర సామగ్రి కొట్టుకుపోవడంతో రాజమ్మ లబోదిబోమంటున్నది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల, మరిపెడ మండలం సీతారాం తండా, డోర్నకల్ మండలం దుబ్బతండాల్లో పరిస్థితి ఇంకా అలానే ఉన్నది. ఆయా తండాల్లోని ప్రజలు తడిసిన నిత్యావసరాలను ఇంటి ముందు ఆరబెట్టుకుంటున్నారు. ఇంట్లో చేరిన బురదను శుభ్రం చేసుకుంటున్నారు. తమ కుటుంబాలను ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

## ధైర్యం నింపిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు

**రావిరాల** గ్రామంలో గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పర్యటించి 110 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం వరద బాధితుల కోసం నిధులు ఇచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇవ్వకపోవడం బాధాకరమని ఆరోపించారు. సీతారాం తండాలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పర్యటించి 56 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. అధికారులు అరకొరగా పారిశుద్ధ్య పనులు చేస్తుండటంతో దుర్వాసన పోవడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ మండలం అయోధ్య తదితర గ్రామాల్లో తెగిన చెరువులను బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పరిశీలించారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం మెడలు వంచైనా రైతులందరికీ నష్టపరిహారం ఇప్పించే వరకు తమ పోరాటం ఆగదని భరోసా కల్పించారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన

- వరదలకు ఖమ్మం, మహబూబాబాద్‌లో తీవ్ర నష్టం
- సహాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- మేము వెళ్తే మామీదే ఉల్టా కేసులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులకు సిద్దిపేట సాయం

సిద్దిపేట, సెప్టెంబర్ 5 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరద సహాయం చేయటానికి ఖమ్మానికి వెళ్తే దాడి చేయటమే కాకుండా.. సీఎం రేవంత్ తమ మీద ఉల్టా కేసులు పెట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది ప్రజాపాలన కాదని, రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. సహాయం చేసేవారిపై ఎవరైనా కేసులు పెడతారా? అని నిలదీశారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని, అంతిమంగా న్యాయం, ధర్మం గెలుస్తుందని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులకు సరుకులు తీసుకెళ్లే మూడు వాహనాలను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సహాయం చేయటానికి వెళ్తే దాడిచేయటం అత్యంత హేయమైన చర్య అని కాం గ్రెస్‌పై దుయ్యబట్టారు. 'మీరే దాడి చేసి మీరే ఉల్టా కేసులు పెడుతున్నారు. అధికారం ఉన్నదని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నావు. ఇది మంచిది కాదు. సహాయం చేసేందుకు వచ్చిన వారిని ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ఖమ్మంలో వరద బాధిత మహిళలు దుమ్మెత్తిపోశారు. నీతి, నిజాయతీ ఉంటే నిజంగా మీది ప్రజాపాలన అయితే ఒకసారి సమీక్ష చేసి కేసులు ఉపసంహరించుకోవాలి. పైనుంచి మీరే ప్రేరేపించి మాపై దాడి చేయించారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడేదేలేదు' అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి మండిపడ్డారు.

### రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

అధికారంలో ఉండి కనీసం మంచినీళ్లు, అన్నం పెట్టలేకపోయారని.. ఒక హెలికాప్టర్ కూడా పంపించలేకపోయారని.. బాధితులకు రూ.10 వేలు ఏమూలకూ సరిపోవని కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండ్లు పూర్తిగా నీట మునిగిన కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు, బలహీన, మైనారిటీ వర్గాల ప్రజలకు చేయూతనివ్వాలని చెప్పారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టం నివారించే అవకాశం ఉండేదని అన్నారు. సామాజిక బాధ్యతగా బీఆర్‌ఎస్ తరపున ఖమ్మంకు సరుకులు పంపిస్తున్నామని, మరో రెండు రోజుల్లో మహబూబ్‌బాద్‌కు కూడా సరుకులు పంపిస్తామని తెలిపారు. ఇప్పటికే కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల ఒక నెల జీతాన్ని సీఎం సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల కోసం కోర్టు మెట్లెక్కినం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులతో తొలిసారి కల్యాణలక్ష్మి చెక్కుల కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. గురువారం 500 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం కూడా ఇస్తామని.. నేటికీ ఇవ్వడం లేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో క్షేమంగా ఉన్న హాస్టళ్లు నేడు సంక్షోభంలో పడ్డాయని విమర్శించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 7 నెలలుగా జీతాలు రావడం లేదని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

### వరద బాధితులకు సిద్దిపేట సాయం

**ఖమ్మం,** మహబూబాబాద్ వరద బాధితులను ఆదుకొనేందుకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, బీఆర్‌ఎస్ నాయకులు స్వచ్ఛందంగా కొన్ని వాహనాల్లో సరుకులు పంపిస్తున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. గురువారం 200 క్వింటాళ్ల సన్న బియ్యం, 2 వేల నిత్యావసర సరుకుల కిట్లు, 500 బ్లాంకెట్లు, 2 వేల బ్రెడ్ ప్యాకెట్లు, కూరగాయలు తదితర సామగ్రిని ఖమ్మంకు పంపించామని, గురువారం, శుక్రవారం కొన్ని వాహనాలను సమకూర్చి మహబూబ్‌బాద్‌కు పంపిస్తామని తెలిపారు. ఎవరికి వారు వరద బాధితులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ తరపున కోరుతున్నట్టు పేర్కొన్నారు.

## ఖమ్మానికి చేరిన సిద్దిపేట నిత్యావసరాలు

ఖమ్మం, సెప్టెంబర్ 5 : ఖమ్మం వరద బాధితుల సహాయార్థం సిద్దిపేట నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు పంపించిన నిత్యావసర సరుకులు గురువారం రాత్రి ఖమ్మానికి చేరాయి. సిద్దిపేట నియోజకవర్గ హరీశ్‌రావు టీం సభ్యులు.. ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో అందజేశారు. వాటిని ఎంపీ రవిచంద్రతో కలిసి ఖమ్మం నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, రూరల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బెల్లం, తెలంగాణ ఉద్యమకారులు రామ్మూర్తి, సుబ్బారావు పరిశీలించి.. డివిజన్, రూరల్ గ్రామాల వారీగా కేటాయించారు.

# ఎట్టకేలకు రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

### అప్, డౌన్ ట్రాక్‌లపై కొనసాగుతున్న రాకపోకలు



కేసముద్రం-ఇంటికన్నె మధ్య పూర్తయిన రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

కేసముద్రం, సెప్టెంబర్ 5 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య ఎట్టకేలకు రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 418వ కిలోమీటర్ రాయి వద్ద ట్రాక్ ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నెల ఒకటిన సాయంత్రం నుంచి రైల్వే అధికారులు వందల మంది కూలీలు, భారీ యంత్రాల సాయంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా, బుధవారం అప్ లైన్ ట్రాక్ పనులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలు ప్రారంభించారు. కాగా, గురువారం ఉదయం డౌన్ లైన్ ట్రాక్ పనులను సైతం పూర్తి చేసి మొదట గూడ్స్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం గోల్కొండ, కృష్ణ, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లను పంపించారు. దీంతో పూర్తిస్థాయిలో రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ కొన్ని రోజులపాటు ఈ ప్రాంతంలో రైళ్ల వేగాన్ని తగ్గించి నడపనున్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

- చిట్యాల పంట పొలాల్లో ఆర్మీ హెలికాప్టర్ ల్యాండ్



**సాంకేతిక** లోపం తలెత్తి ఓ ఆర్మీ హెలికాప్టర్ గురువారం నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలోని పంట పొలంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొని హైదరాబాద్‌లోని హకీంపేటకు వెళ్తుండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీనిని గుర్తించిన పైలట్ ఉదయం 11 గంటల ప్రాంతంలో చిట్యాల శివారులోని పంట పొలాల్లో విశాలమైన ప్రాంతంలో ల్యాండ్ చేశాడు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి వచ్చి సాంకేతిక లోపాన్ని సరిచేసి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌ను హైదరాబాద్‌కు పంపించారు. -చిట్యాల

## వరద సాయం చేయమన్నందుకే అరెస్ట్

### మాజీ కార్పొరేటర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

### విడుదల చేయాలని ధర్నా

### నేతల జోక్యంతో విడుదల

ఖమ్మం, సెప్టెంబర్ 5: ఖమ్మం నగరం బొక్కలగడ్డ వద్ద అద్దెకున్న వారికీ సాయం అందించాలని కోరిన బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై స్థానికులు తీవ్ర అ భ్యంతరం వ్యక్తం చేశారు. స్థానికులకే ఇస్తుండటంతో సిబ్బందికి, నాగేశ్వరరావుకు మాటామాటా పెరిగింది. కాంగ్రెస్ రావడంతో ఉద్రిక్తత నెలకొన్నది. త్రీటౌన్ పోలీసులు వచ్చి నాగేశ్వరరావును తీసుకెళ్లారు. నిరసనగా వందలాది మంది మాటేటి కిరణ్ ఆధ్వర్యంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకున్నది. బీఆర్‌ఎస్ నేతలు పగడాల నాగరాజు, తోట వీరభద్రం సీఐతో మాట్లాడటంతో నాగేశ్వరరావును విడిచిపెట్టడంతో స్థానికులు ఆందోళనను విరమించారు.

## వెల్లువెత్తుతున్న సాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): వరద బాధితులను ఆదుకునేందుకు దాతల నుంచి సహాయం వెల్లువెత్తుతున్నది. గురువారం పలువురు దాతలు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి చెక్కులను అందజేశారు. ఎస్బీఐ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5 కోట్లను విరాళంగా ప్రకటించారు. అరబిందో ఫార్మా రూ.5 కోట్లు అందజేసింది. విద్యుత్ ఉద్యోగులు ఒక రోజు వేతనం రూ. 15 కోట్లు విరాళంగా అందజేశారు. ఎంపీ బండి పార్థసారథి రెడ్డి కోటి రూపాయలు విరాళంగా అందజేశారు.

| దాత | మొత్తం(రూ.) |
|---|---|
| విద్యుత్ శాఖ | 15 కోట్లు |
| ఎస్బీఐ | 5 కోట్లు |
| అరబిందో ఫార్మా | 5 కోట్లు |
| ఏఐజీ హాస్పిటల్స్ | కోటి |
| ఎంపీ పార్థసారథిరెడ్డి | కోటి |
| అంబికా గ్రూప్ | 5 లక్షలు |
| మల్లు రవి | 1.90 లక్షలు |